

ఉన్నత విద్యలో మార్పులు అవసరం

ఉన్నత విద్యలో మార్పులు అవసరమని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీ.భారతి తెలిపారు. - 8లో



వైభవంగా గోవిందుడికి కవచ ప్రతిష్ట

గోవిందరాజస్వామి ఆలయంలో చేపడుతున్న జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు కవచ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	34	26
చిత్తూరు	34	26
తిరుమల	30	22
గూడూరు	37	28
నగరి	36	27

న్యూస్‌రీల్

అరణియార్‌లో చేపల వేట నిషేధం



చేపల వేట నిషేధ బ్యానర్‌తో లైసెన్స్‌దారులు

పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్‌లో రెండు నెలల పాటు చేపల వేటను నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర బాబు తెలిపారు. శనివారం అరణియార్ మత్స్యకార్మిక లైసెన్సుదారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేపల సంతానోత్పత్తి సమయమైన జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ క్రమంలో శనివారం నుంచి ఆగస్టు 31 వరకు ప్రాజెక్టులో చేపలు పట్టడాన్ని నిలుపుదల చేస్తున్నట్టు వెల్లడించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


బాలికల వసతి గృహం ప్రారంభం



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల కోసం స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో వసతి కల్పించారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జిల్లా సోషియల్ వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక జూనియర్ కళాశాలలో ప్రభుత్వం కొత్తగా ఎంపీసీ, బైపీసీ, గ్రూపులను ప్రవేశపెట్టగా.. ఇప్పటివరకు మొత్తం 27 మంది అడ్మిషన్ అయ్యారని తెలిపారు. వీరికి హాస్టల్ వసతి లేకపోవడంతో ఎస్సీ బాలికల హాస్టల్‌లో వసతి కల్పించామన్నారు. ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉంటాయని, ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వార్డన్లు సుహాసిని, రామయ్య, సాల్మన్‌రాజ్ పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం ఎదుట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రా

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు ఏఈఓ రమేష్, సూపరిటెండెంట్ శేషగిరి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద నమస్కరించి, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. వీఐ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌కు నో చాన్స్

తిరుపతి అర్బన్: డ్రాపౌట్స్‌కు చాన్స్ ఇవ్వరాదని.. బడిఈడు పిల్లలంతా బడిలో ఉండాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంఈఓలతోపాటు విద్యాశాఖకు చెందిన పలువురు అధికారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ నుంచి ఇంటర్ వరకు 100 శాతం విద్యార్థులు చదువుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 88 శాతం మాత్రమే విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారని.. మరో వారం రోజుల్లో 100 శాతం పూర్తి చేయాలన్నారు. డీఈఓ వీ శేఖర్, ఆర్‌ఐఓ రమేష్, జిల్లా ఇంటర్మీడియెట్ ఒకేషనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి ‘సురక్ష’

క్షేత్రస్థాయిలో పేదల కష్టసుఖాలను తెలుసుకోవాలి. పార్టీలు.. కులాలు.. మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వ పథకాల లబ్ధిని చేకూర్చాలి. ప్రజావసరాల మేరకు సకాలంలో ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి. ఇదే లక్ష్యంతో ‘జగనన్న సురక్ష’కు శ్రీకారం చుట్టినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తాం
- క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరిస్తాం
- ప్రజారోగ్య రక్షణకు పెద్దపీట వేస్తున్నాం
- చంద్రబాబు మోకాలొడ్డినా ప్రాజెక్టులు నిర్మిస్తాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు : ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై.. వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే మహోన్నతమైన కార్యక్రమమే జగనన్న సురక్ష అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పుంగనూరులో జగనన్న సురక్షకు కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో ఆయన శ్రీకారం చుట్టారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, ఆరణి శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ ఎండీ వీరపాండ్యన్ పాల్గొన్నారు. ఈ క్రమంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రేషన్‌కార్డుదారులకు గోధుమ పిండి, రాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడారు. అర్హులైన వారికి సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలు అందకుంటే వారిని గుర్తించి లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. గతంలో ఎవరైనా సర్టిఫికెట్ పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, అలాంటి ఇబ్బందులు లేకుండా నేరుగా ధ్రువీకరణ పత్రాలు తీసుకునే వెసులుబాటును సురక్షతో కల్పించామని వివరించారు. జిల్లా యంత్రాంగం బృందాలుగా జగనన్న సురక్ష అమలు తీరును పకడ్బందీగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ఏది ఏమైనా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే చిత్తశుద్ధితోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వెల్లడించారు. ఈ మేరకు అధికారులు సైతం బాధ్యతగా తీసుకుని ప్రభుత్వం నిర్దేశించిన నెలలోపు జగనన్న సురక్షను పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రజారోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. అందులో భాగంగా పోషకారం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా రాగులు, గోధుమ పిండి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు అధిక విస్తీర్ణంలో చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారులు సైతం రైతుల నుంచి గిట్టుబాటు ధరకే చిరుధాన్య పంటలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి 2,300 వ్యాధులను తీసుకువచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని వెల్లడించారు. ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేకే చంద్రబాబు అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గతంలో 600 హామీలు గుప్పించి ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబుకు అసలు ఓటు అడిగే అర్హతే లేదని స్పష్టం చేశారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు, పుంగనూరు , పలమనేరు, కుప్పం ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రిజర్వాయర్లు నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారని తెలిపారు. అలాగే గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ ద్వారా నీరు అందించి ఈ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలని బృహత్తర కార్యక్రమం చేపట్టామన్నారు. అయితే చంద్రబాబు తప్పుడు ఆరోపణలతో స్టేలు తెచ్చి, పనులు ఆపించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రాజెక్టులు నిర్మించి ప్రజలకు నీరు అందిస్తామన్నారు. చంద్రబాబు కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, వారే తగిన గుణపాఠం నేర్పుతారని స్పష్టం చేశారు.



తిరుపతి 41వ డివిజన్‌లో ధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్న లబ్ధిదారులతో మేయర్ శిరీషా డెప్యూటీ మేయర్లు అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, కమిషనర్ హరిత



వెంకటగిరి బంగారుపేట సచివాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన రామ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ

నిరుపేదలు ‘సురక్ష’ంగా ఉండాలనీ..



వెంకటగిరి నియోజకవర్గంలో సర్టిఫికెట్లు అందిస్తూ..

తిరుపతి అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలున్నాయని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. వారం రోజులుగా ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు తెలుసుకున్న సమస్యలకు పరిష్కారం చూపించారు. వెంకటగిరి నియోజకవర్గంలోని మున్సిపాలిటీ పరిధిలో 1, 2 వార్డులతోపాటు బాలాయపల్లి మండలం, మన్నూరు సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంపును కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులకు అవసరమైన 11 రకాల సర్టిఫికేట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 11 వేలకు పైగా ఫిర్యాదులందాయని, అందరికీ న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలం, పల్లం గ్రామ సచివాలయ పరిధిలోని క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సుశీలాదేవి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేత బియ్యపు పవిత్రారెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీ చేస్తున్న సర్టిఫికెట్లు

ఆదాయ ధ్రువీకరణ పత్రం, డేట్ ఆఫ్ బర్త్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, డెత్ సర్టిఫికెట్, మ్యూటేషన్, కొత్త రేషన్‌కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు గుర్తింపు కార్డులు (సీసీఆర్‌సీ), వివాహ ధ్రువీకరణ పత్రం తదితర సర్టిఫికెట్లు అందజేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటా సభలకు ఎంపీ, ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ మూడు రోజుల పాటు నిర్వహించే సదస్సులకు తిరుపతి ఎంపీ గురుమూర్తి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. శనివారం వారు అమెరికాలోని డల్లాస్ నగరానికి చేరుకోగా.. స్థానిక తెలుగు అసోసియేషన్ సభ్యులు ఘన స్వాగతం పలికారు.



డల్లాస్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

గోవిందా గోవింద!



వారాంతపు సెలవులు కావడంతో భక్తులు తిరుమలకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో శనివారం అలిపిరి పాదాల మండపం వద్ద భక్తుల సందడి నెలకొంది. భక్తులు పాదాల మండపం వద్ద పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టి గోవిందనామ స్మరణతో కాలినడకన తిరుమలకు బయలుదేరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సీఎం పర్యటనకు పకడ్బందీ భద్రత

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 4వ తేదీన జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పోలీసులు పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఈ మేరకు ఎస్పీ రిషాంత్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి ముఖ్యమంత్రి పర్యటన, కాన్వాయ్ రూట్ మ్యాప్, హెలీప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, బహిరంగ సభలో ప్రజల కూర్చునే గ్యాలరీలను తనిఖీ చేశారు. నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బస్సులు భారీ వాహనాల మళ్లింపులపై చర్చించారు. అలాగే బందోబస్తుపై కీలక ఆదేశాలు జారీ చేశారు. సుమారు 2,500 మంది పోలీసులతో కట్టుదిట్టంగా భద్రత కల్పించనున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సుధాకర్, నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి, సీఐలు విశ్వనాథరెడ్డి, మద్దయ్య ఆచారి పాల్గొన్నారు.



సూచనలిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

బీమాతో ధీమా!

- 8న రైతులకు వైఎస్సార్ ఉచిత పంట బీమా సొమ్ము జమ
- జిల్లాలో 2,193 మంది రైతులకు లబ్ధి



తిరుపతి రూరల్ గొల్లపల్లి ఆర్బీకేలో జాబితాను పరిశీలిస్తున్న రైతులు

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తోంది. వారికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్న రైతులకు బీమా సొమ్ము చెల్లిస్తోంది. జిల్లాలో 2022 ఖరీఫ్‌లో నష్టపోయిన 2,193 మంది రైతులకు రూ.70.82 లక్షల సొమ్మును చెల్లించనుంది. ఈ మేరకు ఈనెల 8న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లోకి నిధులు జమచేయనున్నారు. అర్హుల జాబితాను సోషల్ ఆడిట్ నిమిత్తం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు.

అభ్యంతరాలు తెలియజేయండి



రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకానికి సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 4వ తేదీలోపు తెలియజేయాలి.

– ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

క్లుప్తంగా

గేదెను ఢీకొన్న బైక్


మృతి చెందిన శ్రీనివాసులు

కలువాయి: ఎదురుగా వస్తున్న గేదెను అదుపుతప్పి స్కూటీతో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. కలువాయికి చెందిన బంగారు వ్యాపారి గుడిగుంట శ్రీనివాసులు(44) శుక్రవారం రాత్రి వ్యాపార నిమిత్తం నెల్లూరుకు వెళ్లి స్కూటీలో తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో తోపుగుంట సమీపంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని 108 సిబ్బంది పొదలకూరుకు తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కలువాయి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుంతలో పడి వ్యక్తి మృతి

సైదాపురం: మేకలను మేపుకుంటూ ప్రమాదవశాత్తు నీటి గుంతలోపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సైదాపురం పంచాయతీ పరిధిలోని దాడిశెట్టిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. దాడిశెట్టిపల్లి గ్రామానికి చెందిన అంబటి నాగేశ్వరరావు (60) జీవాలు మేపుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలో శనివారం గ్రామానికి సమీపంలోనే ఉన్న నీటి గుంత వైపు జీవాలు వెళ్లడంతో వాటిని తరిమే క్రమంలో ఆ గుంతలో జారి పడిపోయాడు. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి బయటకు తీసేటప్పటికే నాగేశ్వరావు మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కోర్టు ధిక్కార పరిధిని

సాధనంగా వాడుకున్నారు!

వాస్తవాలను దాచి పెట్టి అధికారులపై కోర్టు ధిక్కార పిటిషన్

- ప్రభుత్వ ఉద్యోగిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం
- ఖర్చుల కింద రూ.25వేలు చెల్లించాలని పిటిషనర్‌కు ఆదేశం



సాక్షి, అమరావతి: కోర్టు ముందు వాస్తవాలను దాచిపెట్టి కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేసినందుకు ప్రభుత్వ ఉద్యోగి అయిన ఓ పిటిషనర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బదిలీని అడ్డుకునేందుకు అధికారులపై అతను దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. అంతేగాక రూ.25 వేలను ఖర్చుల కింద చెల్లించాలని, ఆ మొత్తాన్ని నాలుగు వారాల్లో ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం పేరు మీద జమ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు వెలువరించారు.

సర్వీసు నుంచి తొలగింపుపై పిటిషన్

తిరుపతి జిల్లా, నాయుడుపేటకు చెందిన అంబటి శ్రీనివాసులు నాయుడు ఏపీ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌పీడీసీఎల్) ఉద్యోగి. ఇతన్ని సస్పెండ్ చేస్తూ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ మెమో జారీచేశారు. దాన్ని సవాలు చేస్తూ శ్రీనివాసులు నాయుడు గత ఏడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ ఆ మెమోను సస్పెండ్ చేస్తూ పిటిషనర్ శ్రీనివాసులు నాయుడిని ఉద్యోగం చేసుకోనివ్వాలంటూ ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం శ్రీనివాసులు నాయుడును ఉద్యోగంలోకి తీసుకున్న అధికారులు అతన్ని ఉదయగిరికి బదిలీ చేశారు.

పోస్టింగ్ ఉత్తర్వుల గురించి పిటిషన్‌లో ఎక్కడా చెప్పలేదు

శ్రీనివాసులు నాయుడు తరఫు న్యాయవాది ఆర్.సుధీర్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, అందువల్ల అతన్ని ఉదయగిరికి బదిలీ చేయడం తగదన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్, అనారోగ్య సమస్యలన్నవి పూర్తిగా వేరని, వాటిని ప్రస్తుత కోర్టు ధిక్కార పిటిషన్‌లో విచారించజాలమని తేల్చిచెప్పారు. పోస్టింగ్ ఆర్డర్‌ను నేరుగా తీసుకునేందుకు పిటిషనర్ నిరాకరించడం, రిజిస్టర్ పోస్టు ద్వారా ఆ ఆర్డర్‌ను అందుకున్న విషయాన్ని దాచిపెట్టడం అన్నదే ఇక్కడ ప్రధాన విషయమన్నారు. శ్రీనివాసులు నాయుడు కోర్టు ప్రక్రియను దుర్వినియోగం చేస్తూ ఈ కోర్టు ధిక్కార పిటిషన్‌ను దాఖలు చేశారని న్యాయమూర్తి తేల్చారు. ఈ మేరకు రూ.25వేలను ఖర్చుల కింద చెల్లించాలని శ్రీనివాసులు నాయుడును న్యాయమూర్తి ఆదేశించారు.

కోర్టు ఆదేశాలను గౌరవించి విధుల్లోకి తీసుకున్నాం

ఇదిలా ఉంటే కార్పొరేషన్ అధికారులు కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారంటూ శ్రీనివాసులు నాయుడు వారిపై హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీ కె.సంతోష్‌రావు, సూపరింటెండింగ్ ఇంజినీర్ బి.వెంకట సుబ్బయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.కృష్ణప్రసాద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ సుధాకర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ ప్రతివాదులుగా ఉన్న అధికారులకు నోటీసులు జారీచేశారు. ఇటీవల ఈ కోర్టు ధిక్కార వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. ఏపీఎస్పీడీసీఎల్ తరపు న్యాయవాదులు కొవ్వూరి వెంకట్రామిరెడ్డి, అభయ్ జైన్ వాదనలు వినిపిస్తూ, కోర్టు ఆదేశాల మేరకు పిటిషనర్ శ్రీనివాసులు నాయుడును విధులోకి తీసుకుని అతన్ని ఉదయగిరికి బదిలీ చేశారని తెలిపారు. పోస్టింగ్ ఆర్డర్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 1న పిటిషనర్‌కు అందచేయగా, ఆ ఆర్డర్‌ను నేరుగా తీసుకునేందుకు అతను నిరాకరించారని, దీంతో 7వ తేదీన రిజిస్టర్ పోస్టు ద్వారా పోస్టింగ్ ఆర్డర్ పంపగా, దాన్ని 8వ తేదీన అందుకున్నారంటూ, ఇందుకు సాక్ష్యంగా పోస్టల్ శాఖ ట్రాకింగ్ రిపోర్ట్‌ను వారు కోర్టు ముందుంచారు. బదిలీ తర్వాతవాత కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసిన శ్రీనివాసులు నాయుడు అధికారులు ఇచ్చిన పోస్టింగ్ ఆర్డర్ గురించి తన పిటిషన్‌లో పేర్కొనలేదని వెంకట్రామిరెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇది కోర్టు ముందు వాస్తవాలను దాచిపెట్టడమే అవుతుందన్నారు.

ఘనంగా కపిలేశ్వరుడికి పవిత్ర సమర్పణ


శ్రీకామాక్షి అమ్మవారి సమేత శ్రీకపిలేశ్వరస్వామి వారికి పవిత్ర సమర్పణ చేస్తున్న అర్చకుడు

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం వేడుకగా గ్రంథి పవిత్ర సమర్పణ చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం యాగశాల పూజ, హోమం, లఘు పూర్ణాహుతి, గ్రంథి పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం యాగశాల పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో కె.సుబ్బరాజు, కంకణభట్టార్ ఉదయకుమార్ గురుకుల్, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు రూ.లక్ష విరాళం

కపిలేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల కోసం రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శనివారం రూ.లక్ష విరాళం అందజేశారు.

ఉన్నత విద్యలో మార్పులు అవసరం

తిరుపతి ఎడ్యుకేషన్:కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం ఉన్నత విద్యలో సమూల మార్పులు ఎంతో అవసరమని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డీ.భారతి తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కాకినాడలోని జేఎన్‌టీయూ కళాశాలలో రాష్ట్ర ఉన్నత విద్యాప్రణాళిక మండలి 5వ సమావేశం శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర ఉన్నత విద్య ప్రణాళిక మండలి సమావేశం 'భవిష్యత్తు బోధనలు.. ఉన్నత విద్యలో బోధనాపరమైన మార్పులు' అనే అంశంపై మేధావులు, వీసీలు, విద్యావేత్తల ప్రాథమిక స్థాయి సూచనలు, సలహాలు తీసుకునేందుకు రెండు రోజుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి మహిళా వర్సిటీ వీసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటగా నూతన జాతీయ విద్యావిధానాన్ని తమ వర్సిటీనే అనుసరించిందని తెలిపారు. విశ్వవిద్యాలయాలతో బోధన, పరిశోధన రంగాల్లో ఒప్పందాలు చేసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు.

వైభవంగా గోవిందుడికి కవచ ప్రతిష్ఠ


కవచ ప్రతిష్ఠ అనంతరం స్వామి, అమ్మవార్లకు హారతులు సమర్పిస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో చేపడుతున్న జ్యేష్ఠాభిషేకంలో భాగంగా రెండో రోజు శనివారం కవచ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. ఉదయం శతకలశ స్నపనం, మహా శాంతి హోమం చేపట్టారు. అనంతరం ఆలయంలోని కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. తర్వాత ప్రత్యేక పూజలు నిర్వహించి కవచ ప్రతిష్ఠ చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారు తిరుచ్చిపై కొలువై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయంగార్ స్వామ, చిన్న జీయంగార్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, ఏఈవో రవి కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనుంజయులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా


మృతి చెందిన జితేంద్రపవన్

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. వివరాలు.. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన శ్రీనివాసరావు, పద్మజ కుమారుడు జితేంద్ర పవన్ (23)ను చంద్రగిరి మండలం, రంగంపేట సమీపంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీలో ఎంబీఏ కోర్సులో చేర్పించారు. ఈ క్రమంలో యూనివర్సిటీకి సమీపంలోనే ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్న జితేంద్ర పవన్ శనివారం సెలవు కావడంతో సరదాగా ఈత కొట్టేందుకు కళ్యాణి డ్యాంకు తోటి విద్యార్థులతో కలిసి వెళ్లాడు. లోతు ఎక్కువగా ఉండడంతో జితేంద్రపవన్ మునిగిపోయాడు. మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల మార్చురీకి తరలించినట్లు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.





